# శ్రుతిమించిన ఓర్పు

వేమూరి సుబ్రహ్మణ్యం

కథానిక

ఉస్సూరు మంటూ రాధాకృష్ణ ఆఫీసునుండి యింటికి రాగానే, శకుంతల వంటింట్లోంచి బాణంలాగా వాకిట్లోకి దూసుకొచ్చి "సినిమా కెళ్దామని నాతో ఎందుకు చెప్పాలి? ఏడింటిదాకా యింటికి రాకుండా ఎందుకుండాలి?" అని విసురుగా అడిగింది.

అసలే చిరాకుగా వున్నాడేమో రాధాకృష్ణ "నా ఇష్టం అక్కడ ఆఫీసులో సాధింపు అయింది, యింటికొస్తే మళ్ళ యిక్కడ మొదలుపెట్టావూ?" అన్నాడు కోపంగా. అంతలో తన కోపానికి తానే సిగ్గుపడి "అదికాదు శకూ, మరి ఆఫీసరు 'ఫలాని పనిచేసి వెళ్ళవోయ్' అని చెప్పినపుడు చేయక పోతే బాగుంటుందా? సినిమాకు యివ్వాళ కాక పోతే రేపు వెళ్ళవచ్చు" అని అన్నాడు లాలింపు ధోరణిలో.

"అంతేలెండి'ఇంట్లో పెళ్లానికి మాట యిచ్చామే, పని యివ్వాళ కాకపోతే రేపుచేసుకోవచ్చులే'అని యింటికొచ్చే ధ్యాసమీకు వుంటేగా? యింట్లోనే సెట్లా కుమిలిచస్తే మీకేం?"

"అదిగాదు శకూ మరి ఆఫీసరు..."

"ఆఫీసరు! ఆఫీసరు! యింట్లో పెళ్ళాంకంటే ఆఫీసరు ముఖ్యం అన్నమాట మీకు, అంతేలెండి" అంటూ చిటపటలాడుతూ లోపలికెళ్ళింది. రాధాకృష్ణ పెళ్ళాం కోపంతో లోపలికెడితే భరించ లేడు! అందుకని ఆమె వెనకాలే లోపలికెళ్ళి "చూడు శకూ, ప్రతిదానికీ యిట్లా కోపం తెచ్చుకొంటే ఎట్లా? నా కష్ట సుఖాలుగూడా కాస్త ఆలోచించాలి మరి. ఆఫీసు పనిచేయక ఆఫీసరుకు కోపం తెప్పిస్తే, ఆయన మనలను ఏ మాన్యాలకో ట్రాన్స్ఫర్ చేస్తే యిక బ్రతికినట్టే అందుకని ఆయన మాటలు వినితీరాలి. ఇక యింట్లోకూడా నువ్వు కోపంతో యిట్లావుంటే నాస్థితి ఎట్లా వుంటుందో చెప్పు" అన్నాడు బ్రతిమాలుతూ.

కాని శకుంతల కోపం తగ్గలేదు. అది ఆమెకు మామూలే. ఆమెకు బ్రతిమిలాడిన కొద్దీకోపం ఎక్కువౌతుంటుంది. ఎంతో బ్రతిమాలితేకాని కోపం తగ్గదు. రాధాకృష్ణ అందుకని చాలా శ్రమపడతాడు. ఒక్కొక్కసారి బ్రతిమాలి, బ్రతిమాలి అతనికి విసుగుగూడ పుడుతుంది. కాని ఆమె కోపంతో, తాను విసుగుతో వుంటే సంసారం నరకమయ మవుతుందనే భయంతో ఎంత విసుగు కలిగినా ఆమెకోపం తగ్గేవరకూ ఓర్పువహిస్తాడు. భర్తలోగల ఈ 'వీక్ పాయింట్' ఆధారం చేసుకొని చీటికీ మాటికీ కోపం ప్రదర్శించి, భర్తచేత బ్రతిమాలించుకొని ఆనందిస్తూ వుంటుంది. అరగంట సేపు పలువిధాలుగా బ్రతిమాలి 'రెండో ఆట సినిమాకెడదాం' అనే హామీతో ఆమెను ఒప్పించ గలిగాడు.

రెండో ఆట సినిమాకెడదాం అని ఎనిమిదింటికీ భోజనం చేశారు దంపతులు. రాధాకృష్ణ వసారాలో కూర్చుని ఉసుబోక ఏదో చదువుకుంటున్నాడు. శకుంతల వంటిట్లో ఏదో పని చేసుకొంటూంది. ఇంతలో బయటినుంచి 'రాధా' అన్న కేక లోపలికి ప్రవేశించి వరుసగా రాధాకృష్ణ చెవుల్లోకి శకుంతల చెవుల్లోకి ప్రవేశించింది. "సుబ్బారావు ఒచ్చాడే ఎందుకో?" అని అనుకున్నాడు రాధాకృష్ణ. "మళ్ళా ఎవరో ఒచ్చారు. రెండో ఆటకు వెళ్ళేయోగ్యతకూడా లేదేమో!" అని అనుకొన్నది శకుంతల. ఇంతలో శకుంతల దగ్గరకొచ్చి రాధాకృష్ణ "చూడు శకూ సుబ్బారావు ఒచ్చాడు. ఏదో పనివుంది రమ్మంటున్నాడు. తొమ్మిదింటికల్లా రెడీగావుండు పని అదీ కానిచ్చి, సినిమా కెళదాం" అన్నాడు.

"ఆఁ! మీరు ఒచ్చినట్టే మనం వెళ్ళినట్టే."

"తప్పకుండా ఒస్తాగా రెడీగా వుండు" అని నొక్కిచెప్పి వెళ్ళిపోయాడు రాధాకృష్ణ శకుంతల భర్తమాట మీది ఆశతో లోపలికెళ్ళింది.

సుబ్బారావు రాధాకృష్ణను సరాసరి కేశవరావు యింటికి తీసుకొచ్చేడు. అప్పుడు గుర్తుకొచ్చింది

రాధాకృష్ణకు, కేశవరావుకు ట్రాన్స్‌ఫర్ అయింది కాబట్టి రేపు వెళ్ళిపోతున్నాడని. బహుశా ఒక చిన్న టీ పార్టీలాంటిదేమైనా వుంటుందేమో అని అనుకున్నాడు. రాధాకృష్ణ అనుకొన్నట్టే వారి మిత్రబృందం అంతా అక్కడే వున్నది. వీళ్ళ కోసమే ఎదురుచూస్తున్నట్టున్నారు ... అప్పుడు అసలు సంగతి బయట పెట్టాడు సుబ్బారావు. "కేశవుడు రేపు వెళ్ళిపోతున్నాడు గదురా. అందుకని సరదాగా సినిమాప్రోగ్రాం వేశాం. తీరా నువ్వు లేకపోతే ఎట్లా? అందుకని..." అన్నాడు సుబ్బారావు.

రాధాకృష్ణ తనకు అరగజం దూరంలో సూచనైనాలేని పిడుగు అమాంతంగా పడ్డట్టు ఫీలయ్యాడు. "ఆరే సారీ బ్రదర్. యివ్వాళ్టికి రాలేను ఎక్స్‌క్యూజ్‌మీ" అన్నాడు.

"ఈ సారీలకు ఎక్స్క్యూజ్ మీలకు ఈ రోజుల్లో విలువయేమీ లేదులే. మరోమాట పలక్కుండా పదపద" అని కేశవరావు దారితీశాడు. అతడితో పాటు అందరూ బయలు దేరారు.

రాధాకృష్ణ సుబ్బారావును ప్రత్యేకంగా పక్కకు పిలిచాడు ఏదో చెప్పటానికి. వాళ్ళిద్దరి మధ్యా సామాన్య రహస్యాలేమీ వుండవు. చాలా సన్నిహితంగా వుండటంచేత ఒకరి సమస్యలు మరొకరికి చెప్పి పరిష్కారమార్గానికై రెండో వారిమీద ఆధారపడటం మామూలు. అందుకనే సుబ్బారావుని ప్రత్యేకంగా పక్కకు పిలిచాడు రాధాకృష్ణ.

"సుబ్బా నేను చెప్పేది బాగా ఆలోచించు. మొదటాటకు వెళ్దామని చెప్పి, ఆఫీసు పనివల్ల రాలేక మా శ్రీమతిని 'డిసీవ్' చేశాను. రెండో ఆటకు తప్పక వెడదామని ప్రామిస్‌కూడ చేశాను. నేను రెండో ఆటకు కూడ తీసుకు వెళ్ళక పోతే అది ఎట్లా ఫీలవుతుంది చెప్పు. అందుకనే నేనింత తటపటాయించేది."

"ఫరవాలేదు లేవోయ్. మీ శ్రీమతికి భయపడి మాతో రావటం మానుతావన్నమాట."

"భయపడి కాదనుకో. రెండుసార్లు 'డిసీవ్' చేస్తే అదెట్లా బాధపడుతుందో ఆలోచించు."

"నిజమే బాధపడవచ్చు. కాని యిక్కడి పరిస్థితి. కేశవరావు టాన్స్ఫర్ అయి వెడుతున్నాడా. మరి ఎన్నాళ్ళకో వాడిని కలుసుకోవటం. అసలు కసులుకొంటామో లేదో? అందుకని ఈ పూట అయినా వాడితో కులాసాగా గడిపితే ఎంతో బాగుంటుంది. రేపు కావలిస్తే శెలవుపెట్టి యింటిదగ్గరే వుంటే మ్యాట్నీతో సహా మూడు ఆటలకు తీసుకెళ్ళు మీ శ్రీమతిని. అంతేకాని ఇప్పుడేమీ అభ్యంతరంచెప్పకు పద,పద"అని సుబ్బారావు బలవంతాన లాక్కెళ్ళాడు రాధాకృష్ణను...

ఆరాత్రి రెండింటికి రాధాకృష్ణ యింటికొచ్చి తలుపుతట్టేసరికి శకుంతల మౌనంగా తలుపుతీసి మాట్లాడకుండా వెళ్ళి పడుకొన్నది.

తెల్లవారిన తరువాత కూడ శకుంతల రాధాకృష్ణతో మాట్లాడలేదు. రాధాకృష్ణకు భయం వేసింది. యిటువంటివి అశ్రద్ధచేస్తేనే జీవితాంతం బాధపడవలసి వస్తుందని అతడి అభిప్రాయం. అందుకనే అతడు ఆత్మాభిమానాన్ని చంపుకుని "క్షమించు శకూ. రాత్రి ఒక స్నేహితుడు బదిలీ అవుతుంటే బలవంతాన వాళ్ళంతా కలిసి సినిమాకు లాక్కెళ్ళారు. కావలంటే యివ్వాళ సెలవు పెడతాను. రెండాటలకూ వెడదాం. ఏం?" అన్నాడు జాలిగా-కాఫీ తెచ్చిన శకుంతలతో.

శకుంతల మాట్లాడకుండా కాఫీ అక్కడపెట్టి వెళ్ళిపోయింది. తనను ఎవరో కొరడాతో చెళ్లను కొట్టినట్టు ఫీలయ్యాడు రాధాకృష్ణ.

కాసేపటికి శకుంతల కూరల సంచీ తెచ్చి అక్కడ పడేసి వెళ్ళిపోయింది. "ఇంట్లో కూరలు లేవు" అని భావించుకొని రాధాకృష్ణ బజారుకు బయలుదేరేడు. కూరలు తేవటానికి అసలే మనస్సు వికలం అయింది. వికలమయిన మనస్సుతో చేసే పనులన్నీ నాశనం అవుతయ్. ఏవేవో బేరంచేసి, ఏవోకొని మొత్తానికి 'కూరలు తెచ్చాను' అనిపించుకొన్నాడు రాధాకృష్ణ.

కాసేపటికి సూచనలులేని భయంకర తుఫాను లాగావచ్చింది శకుంతల రాధాకృష్ణ దగ్గరకు."ఏమి కూరలండీ యివి? పుచ్చులేని కాయ ఒకటి చూపించండి. యిటువంటి కూరలు తేకపోతే ఏ దేవుడేడ్చేడు! యింత వయసొచ్చినా కూరలు తేవటం చేతగాకపోతే ఎలా! ఛీ- ఛీ! రేపటినుంచీ నేనే బజారుకెళ్ళి తెస్తాను కూరలు." అని ఎట్లా ఒచ్చిందో అట్లాగే వెళ్ళిపోయింది శకుంతల.

ప్రతిదానికి ఒక పరిమితివుంది. పరిమితిని దాటి పరిశీలిస్తేగాని, ప్రవర్తిస్తేగాని అనర్థాలు తప్పవు. అలాగే సహనానికి కూడ ఒక పరిమితివుంది. పరిమితిని మించి ప్రవర్తిస్తే సహనాన్ని కోల్పోతారు మానవులు రాధాకృష్ణ తన సంసారంలో తుఫాను తీసుకొని రావటం యిష్టంలేక భార్యమాటే పైచెయ్యిగా సహిస్తూ ఒచ్చాడు. ఆమె అన్నమాటలకు గూడ వెంటనే కోపం తెచ్చుకొని, తానూ నాలుగు అని, ఆమె మళ్ళా ఎదో అని, తాను కోపంపట్టలేక చెయి చేసుకోవటం మొదలైనవేవీ అతనికి గిట్టవు. అందుకని అతడు చాలా మెత్తగా ప్రవర్తించేవాడు. భర్త మెతకచూచి శకుంతల మరి కొంచెం విజృంభించేది. ఈ మధ్య ఆమె కాస్త దురుసుగానే మాట్లాడటం సాగించింది. దీనికితోడు ఇటీవల రాధాకృష్ణ తన సహనాన్ని కోల్పోతూ ఒచ్చాడు. ఈ సంఘటనతో అతడికి చీకాకు వేసింది. భార్యప్రవర్తన చూచి అసహ్యం వేసింది. ఆమె ప్రవర్తన ఇలాగే వుంటే జీవితం నరకప్రాయం తప్ప మరొకటిలేదు. అందుకని ఆమె ప్రవర్తనను మార్చగల ఉపాయం కోసం చాలాసేపు ఆలోచించాడు. కాని ఏమీ తట్టలేదు. ఏమీ తోచక బజారుకేసి బయలుదేరాడు.

దారిలో సుబ్బారావు కనుపించేడు. రాధాకృష్ణను చూడగానే "ఏరా ఇస్పేటు జాకీ మొహంతో బయలుదేరావు. ఏమిజరిగిందేమిటి. వివరంగా మనవిచేసుకో!" అన్నాడు నవ్వుతూ.

రాధాకృష్ణ ఏమీ మాట్లాడలేదు. సుబ్బారావు రెట్టించి అడిగాడు.

ఆప్తులు కనబడగానే మనస్సులోని బాధను, కష్టాలను, సమస్యలను ఏకరువు పెట్టాలని బుద్ధి పుడుతుంది. అట్లా చేస్తే మనస్సుకు ఎంతో రిలీఫ్ యిచ్చి హాయిగా కూడ వుంటుంది. పైగా మన మనస్సులోని బాధకు నివారణోపాయంగాని, సమస్యలకు పరిష్కార మార్గం కాని చూపగలిగి వుంటారు ఆప్తులు.

రాధాకృష్ణ విషయంలో అంతేజరిగింది. సుబ్బారావు రాధాకృష్ణకు మిత్రుడు మాత్రమే కాదు. ముఖ్య ఆప్తుడుకూడా. అందుకని రాధాకృష్ణ తన మనస్సుల్లోని బాధను సుబ్బారావు ముందు వెడలగక్కేడు. సుబ్బారావు సాంతం ప్రశాంతంగా విన్నాడు. క్షణం ఆలోచించి "వజ్రం వజ్రేనభింజతే" అన్నాడు.

"అంటే" అర్థంకాక అడిగేడు రాధాకృష్ణ.

"మరోవిధంగా అనుకోకపోతే నా సలహా చెబుతానురా"

"అనుకోనులే చెప్పు" అన్నాడు రాధాకృష్ణ.

"చూడు రాధా. వజ్రాన్ని కోయటానికి కత్తి ఉపయోగిస్తే ఏమవుతుంది. మొద్దుబారుతుంది. అంతేగా? వజ్రం తెగదు. అందుకని వజ్రాన్ని కోయటానికి వజ్రమే కావాలి. నేను చెప్పింది సహృదయంతో ఆలోచించు."

రాధాకృష్ణ కాసేపు ఆలోచించాడు. సుబ్బారావు చెప్పింది అర్థం అయింది- కాని అతని సందేహాన్ని వెలిబుచ్చాడు "మరి నువ్వుచెప్పినట్టే నేనూ ప్రవర్తిస్తే సంసారంలో తుఫానులేచి అల్లకల్లోలం రేగుతుందేమోనని భయంగూ వుందిరా"

"అదీ. అక్కడే జాగ్రత్తగా వుండాలి. కాస్త కమాండిగ్ పవర్ వుపయోగించాలి."

"అలాగేలే"

"పదరా కాఫీ యిప్పిస్తాను. నీ అమోఘమైన సలహాకు" అని రాధాకృష్ణ సుబ్బారావును హోటల్లుకు లాక్కెళ్ళాడు.

ఆ సాయంత్రం రాధాకృష్ణ యింటికొచ్చేటప్పటికి ఏడయింది. "అప్పుడే ఒచ్చారేం? యిప్పుడు ఏడే అయింది" అన్నది శకుంతల.

"నా యిష్టం. ఎప్పుడొస్తే నీకేం. యింకా నయం యిప్పుడయినా ఒచ్చాను సంతోషించు" అన్నాడు రాధాకృష్ణ విసురుగా.

"అవునులెండి మీరెప్పుడయినా రావచ్చు. నేనుమాత్రం..."

"నువ్వా బయలుదేరకపోయ్యావా? బజార్లవెంట తిరుగు రేపటినుంటీ; వొద్దంటే అప్పుడడుగు."

"ఆఁ! నా బతుక్కు తోడు..."

"నోర్ముయ్. ఏమిటా వాగుడు? ఇప్పుడు నీ బతుక్కేమొచ్చింది?"అని గర్జించేడు రాధాకృష్ణ. ఈ కొత్తరకం కంఠస్వరం విని చకితురాలయింది శకుంతల. కాస్త భయపడ్డది కూడా. మరేమీ మాట్లాడకుండా లోపలికెళ్ళింది.

కాసేపటికి "అన్నం వడ్డించాను రండి" అన్న పిలుపుతో అన్నంముందుకొచ్చి కూర్చున్నాడు రాధాకృష్ణ. "కూరలు ఏమీ చేయలేదా?" అన్నాడు.

"ఊహుం."

"మరి పులుసుగాని, పప్పుగానీ..."

"ఊహుం! ఏదీ చేయలేదు."

"అయితే ఈ అన్నం నాకక్కరలేదు" అంటూ కలుపుతూ ఉన్న అన్నాన్నొదిలేసి వెళ్ళిపోయేడు రాధాకృష్ణ. భర్త ప్రవర్తన చూచి ఆశ్చర్యపోయింది శకుంతల. యిదివరకెప్పుడూ యిలా జరుగలేదు. ఈసారి ఆయనకు నిజంగానే కోపం వచ్చినట్లుంది. అయినా తనే తప్పుచేసింది. కూరగాయలు యింట్లో వున్నా బద్ధకంతో ఏమీ వండలేదు. పగలల్లా ఆఫీసులో పనిచేసి వట్టి అన్నం పచ్చళ్ళు తినమంటే ఎవరికైనా ఎట్లా వుంటుంది? ఎంతకష్టం?" అని తనలో తానే తర్కించుకొన్నది.

"అన్నానికి లేవండి" అన్నది శకుంతల బ్రతిమాలుతున్న ధోరణిలో.

"నాకేం అక్కర్లేదు నువ్వేతిను ఆపచ్చళ్ళతో అన్నం" కోపంగా అన్నాడు రాధాకృష్ణ.

"ఈ ఒక్కసారికే క్షమించండి బద్ధకంతో ఏమీ చేయలేదు"

"అందుకే నువ్వొక్కదానివే తిను. నాకేం అక్కర్లేదు. నే నెట్లాపోతే నీకేం!"

"అదేమిటండీ ఆమాటలూ? క్షమించమంటినిగా లేవకపోతే నామీద ఒట్టే" అన్నది కన్నీళ్ళతో.

ఇక ఆలస్యం చేయకూడదనుకుని "సరే పద" అని అన్నాడు రాధాకృష్ణ పైకి కనబడని లోపలి ఆనందంతో.

కథానిక

# తీరిన కోరిక

## వడ్లపట్ల దయానందం

గౌరట్రాజు స్కూలుఫైనలు రెండోసారితప్పడమూ, జానకిఇంటర్ పాస్ కావడమూ ఒకేసారిజరిగినై.

కుమారి జానకిని, ఇంటర్‌లో కాలిడేముందు—చిరంజీవి గౌరట్రాజు—ఇరుపక్షాల పెద్దల సమ్మతిమీద, పలువురు పెద్దలసమక్షంలో, పురోహితులు మంత్రపఠన కావిస్తూండగా, శాస్త్రోక్తంగా, సూత్రబంధన మొనర్చి, శ్రీమతిగా మార్చడంవల్లే అసలు చిక్కు ఉత్పన్నమయింది.

రిజల్ట్సు బయటబడ్డ మరుక్షణంలోనే- మూడోసారి మళ్ళా హైస్కూలులోనే చేరి, స్కూలుఫైనలు చదువ, నిర్ణయించుకోడానికి గౌరట్రాజుకు ఏ అభ్యంతరమూ లేకపోయింది. మీదుమిక్కిలి జానకి సైతం సుముఖతనే వెల్లడించింది. కాని ఎటొచ్చీ బి. ఏ, కూడా పూర్తిచేదామనుకున్న జానకికే, పెద్ద చిక్కొడ్డొచ్చి తనకీ, చదువుకీ మధ్య అడ్డుగోడలా నిలచింది.

అసలు గౌరట్రాజుకున్న యాభై ఎకరాల సుక్షేత్రమైన మాగాణీనే కేవలం ఆ పిల్లమెడలో గౌరట్రాజుచేత మూడుముళ్ళా వేయించడానికి దోహదకారయిందన్నది ఊబుసుపోసినవారి విమర్శ. అది విశ్వసించడానికి బలమైన ఆధారాలంతగా లభించవు.

ఒకే క్లాసు కాకపోయినా, స్వకులస్థుడు. అందులోనూ, ఒకవిధంగా చాలా దూరపుబంధువు కావడంవల్ల స్కూలుఫైనలు చదువుతున్న జానకి మనసు మూడుసంవత్సరాల క్రితం ఫెఫ్తుఫారం చదువుతున్న గౌరట్రాజువైపునకు ఓ సుభసమయాన మరలిందన్నది యదార్థం. తీరా మరలినతరువాత, కళ్ళెంబిగించి, మనసును దిట్టపరచుకోబోయిందికాని, అది వ్యర్థప్రయత్నంగానే వేగిపోయింది.

ఎర్రగా చక్కగా ఆ కోలముఖం కొట్టొచ్చినట్లుండే ముక్కు, చిలిపిగాచూచే ఆ కళ్లు జానకిని ప్రచండవేగంతో తమవైపు లాక్కున్నయ్.

ఎన్నోసార్లు—"ఛ!... నేను చూస్తూన్నది తప్పేమో" అనుకుంది.

మళ్ళా అన్నిసార్లూ "అబ్బ...మరి చాలా బావున్నాడు, పైగా చక్కని ఆస్తి. మీదుమిక్కిలి దూరపుబంధువు కూడాను. పైగా, తను అతని అంత